సాక్షి
జనగామ

ఆదివారం । 26 । ఫిబ్రవరి । 2023



ప్రీతి ఘటనపై ఆందోళనలు

సీనియర్ విద్యార్థి వేధింపులు భరించలేక మెడికల్ విద్యార్థి ప్రీతి ఆత్మహత్యాయత్నం చేసిన ఘటనపై ఆందోళనలు ఆగడం లేదు. - 8లో▸



క్రీడల్లో ప్రోత్సహించాలి

పిల్లలను చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రోత్సహించాలని అర్జున అవార్డు గ్రహీత, డబుల్ ఒలింపియన్ జేజే శోభ తల్లిదండ్రులకు సూచించారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
36°/18°

వాతావరణం

ఉదయం చల్లని వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు పెరిగి ఎండ తీవ్రత అధికమవుతుంది. రాత్రి సమయంలో చలి తీవ్రత కాస్త తగ్గుతుంది.

న్యూస్‌రీల్

బీడు భూముల సస్యశ్యామలమే లక్ష్యం



తరిగొప్పుల: బీడు భూములను సస్యశ్యామలం చేయడమే సీఎం కేసీఆర్ లక్ష్యమని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. వేలేరు మండలం సోడషపల్లిలో సోమవారం ఐటీ మంత్రి కేటీఆర్ పర్యటన నేపథ్యంలో జనసమీకరణకు సంబంధించి పార్టీ మండల అధ్యక్షుడు పింగిళి జగన్మోహన్‌రెడ్డి ఆధ్వర్యాన శనివారం స్థానికంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. సభను విజయవంతం చేయాలని శ్రేణులకు పిలుపునిచ్చారు. సంక్షేమం వద్దు సాగునీరు ముద్దు అనే తీర్మానాలు ఇచ్చిన ఏకైక నియోజవర్గం జనగామ అని.. అందుకే సీఎం కేసీఆర్ సాగు నీటి ప్రాజెక్టులకు పెద్దపీట వేసినట్లు చెప్పారు. వేలేరులో నిర్మించే లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుతో తరిగొప్పుల మండల పరిధి 13 గ్రామాలకు సాగునీరు అందుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ దామెర ప్రభుదాస్, ఎంపీటీసీ భూక్య జుంలాల్‌నాయక్, అర్జుల మధుసూదన్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు చిలువేరు లింగం, సుదర్శన్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, సంజీవ, సుధీర్, రాజేశ్వర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక తరగతులను వినియోగించుకోవాలి



స్టేషన్‌ఘన్‌పూర్: ప్రభుత్వ పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను వినియోగించుకుని వార్షిక పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని డీఈఓ రాము అన్నారు. స్థానిక జెడ్పీఎస్ఎస్‌లో ప్రత్యేక తరగతులను ఆయన శనివారం పరిశీలించి మాట్లాడారు. ఏప్రిల్ 4 నుంచి పదో తరగతి పరీక్షలు ఉన్నాయని, నెలరోజులుగా ఉదయం, సాయంత్రం గంట పాటు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులు ఏప్రిల్ ఒకటో తేదీ వరకు కొనసాగుతాయని చెప్పారు. విద్యార్థులకు ప్రభుత్వం స్నాక్స్ అందిస్తోందని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల సూచనల మేరకు విద్యార్థులు ప్రణాళికతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో డీసీబీ సెక్రెటరీ చంద్రభాను, పాఠశాల నోడల్ అధికారి అజామొహీనొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

'కాలయాపన చేయొద్దు'

జనగామ రూరల్: మూడో విడత ఇందిరమ్మ లబ్ధిదారులకు పట్టాలు ఇచ్చి పదేళ్లుగా స్థలం చూపించలేదు.. ఇళ్లు నిర్మిస్తామని చెప్పి నేటికి ఐదేళ్లు అవుతోంది.. బీఆర్ఎస్ అసమర్థ పాలనకు ఇదే నిదర్శనమని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని చాకలి ఐలమ్మ నగర్‌లో పార్టీ పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్ ఆధ్వర్యాన లబ్ధిదారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డబుల్ బెడ్రూంల కోసం లబ్ధిదారులను ఎంపిక చేస్తామని చెప్పి.. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారిని కూడా సర్వే నిర్వహించడం హేయమైన చర్య అన్నారు. ఇంతకు ముందు అధికారుల పర్యవేక్షణలో 660 మంది లబ్ధిదారులను గుర్తించినా.. తిరిగి సర్వే చేపట్టడం సరికాదన్నారు. సర్వే పేరుతో కాలయాపన చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. నాయకులు విజేందర్, లింగం, వెంకట మల్లయ్య, మీట్యా నాయక్, గౌసియా, విష్ణు, వెంకటేష్, ఉమా, నాజియా, చందు, మైబెల్లి పాల్గొన్నారు.

నేడు ఆలయాల నిర్మాణానికి భూమి పూజ

పాలకుర్తి టౌన్: మండల కేంద్రంలో సేవాలాల్, మేరామయాడి ఆలయాల నిర్మాణానికి ఆదివారం జరిగే భూమి పూజ కార్యక్రమంలో మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతిరాథోడ్ పాల్గొంటారని సేవాలాల్ ఆలయం నిర్మాణ కమిటీ బాధ్యులు డాక్టర్ రవిరాథోడ్, పూల్‌సింగ్ చౌహాన్ తెలిపారు. శనివారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఆలయాల నిర్మాణానికి రూ.2కోట్లు మంజూరుకు మంత్రి దయాకర్‌రావు కృషి చేశారని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు జరుపుల బాలునాయక్, మల్లునాయక్, యాకూబ్, రాంసింగ్, మహేందర్ పాల్గొన్నారు.

శిల్ప కళాసంపద బ్యూటిఫుల్

ఖిలా వరంగల్: కాకతీయుల నిర్మాణ శైలి, శిల్ప కళా సంపద వెరీ బ్యూటిఫుల్ అని బెల్జియం దేశస్తులు కొనియాడారు. శనివారం బెల్జియం దేశానికి చెందిన 35మంది పర్యాటకులు కోటను సందర్శించారు. మధ్యకోట ప్రాంగణంలోని శిల్పాలను తిలకించారు. కెమెరాల్లో శిల్పాల అందాలను బంధించారు. కాకతీయుల విశిష్టత, కట్టడాల గురించి పర్యాటక శాఖ ప్రమోషన్ అధికారి సూర్యకిరణ్ వివరించారు. వారి వెంట కేంద్ర పురావస్తుశాఖ కోఆర్డినేటర్ శ్రీకాంత్, టీఎస్‌టీడీసీ కోఆర్డినేటర్ అజయ్ ఉన్నారు.

పరిశీలించి పరిష్కరిస్తాం..

- 'సాక్షి' ఫోన్‌ఇన్‌లో మున్సిపల్ కమిషనర్ రజిత
- కుక్కల సమస్యకు 15 రోజుల్లో పరిష్కారం
- కోతుల నివారణకు చర్యలు
- డ్రెయినేజీ, పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక ఫోకస్
- ప్రజలు చెప్పిన విషయాలను నోట్ చేసుకున్నాం



ఫోన్‌లో మాట్లాడుతూ సమస్యలు నోట్ చేసుకుంటున్న మున్సిపల్ కమిషనర్ రజిత

జనగామ: పట్టణ ప్రజలు చెప్పే ప్రతి సమస్యను ఓపికగా వింటూ.. సమాధానం చెబుతూ.. ఇంకా ఏమైనా ఉన్నాయా అంటూ కాలనీల్లో నెలకొన్న ఇబ్బందులను తెలుసుకునే ప్రయత్నం చేశారు మున్సిపల్ కమిషనర్ రజిత. కుక్కలు, కోతుల బెడద, తాగునీరు, పారిశుద్ధ్యం, వీధిలైట్లు తదితర సమస్యలపై 'సాక్షి' ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఫోన్‌ఇన్ కార్యక్రమానికి అపూర్వ స్పందన లభించింది. ఉదయం 10.40 నుంచి 12.10 గంటల వరకు జరిగిన ఫోన్‌ఇన్‌లో కమిషనర్ 50 మందితో మాట్లాడగా.. మరో 265 కాల్స్ వచ్చాయి. కుక్కలు, కోతుల బెడద నియంత్రణకు చంపక్ హిల్స్ డంపింగ్ యార్డు వద్ద జంతు జనన నియంత్రణ సెంటర్ ప్రారంభిస్తున్నామని, 15 రోజుల్లో సమస్యకు పరిష్కారం చూపిస్తామని కమిషనర్ చెప్పారు. అలాగే డ్రెయినేజీల నిర్వహణ, వీధిదీపాలు, తాగునీటి శుద్ధీకరణ, పారిశుద్ధ్య కార్మికుల పని తీరు, కుళాయి కనెక్షన్లకు తవ్విన సీసీరోడ్ల మరమ్మతులు, శ్మశాన వాటికలు తదితరాలన్నింటినీ పరిగణలోకి తీసుకుని పరిశీలించి ఒక్కొక్కటిగా పరిష్కారమయ్యేలా చూస్తామని అన్నారు.

లకావత్ లాల్‌మా, 2వ వార్డు : రూ.లక్ష చెల్లించి ఇంటి అనుమతులు తీసుకున్నాం. డ్రెయినేజీ లేదు. ఇంటి ముందు మురికి నీరు ఆగితే పంచాయితీ అవుతోంది.

కమిషనర్ : ఇంజనీరింగ్ అధికారులను పంపిస్తాం

రవీందర్, 7వ వార్డు : డిగ్రీ కళాశాల ఏరియాలో 30 కుటుంబాలకు నల్లా కనెక్షన్ లేదు. వాటర్ పైపులైన్ వేయలేదు. కనెక్షన్‌కు అనుమతి తీసుకున్నా పట్టించుకోవడం లేదు.

కమిషనర్ : తాగునీరు వచ్చేలా చేస్తాం

రాజేష్, 6వ వార్డు, ఎండీ.సయ్యద్, హెడ్‌పోస్టాఫీసు ఏరియా : పోస్టాఫీసు ఆవరణలో దుమ్ము భరించలేకపోతున్నాం. కొత్తగా నిర్మాణం చేస్తున్న రేడియాలజీ హబ్ భవనంతో డ్రెయినేజీలో చెత్త పేరుకుపోయి మురికి నీరు ఆగి కంపుకొడుతోంది.

లక్ష్మణ్, వ్యాపారి : ఆర్టీసీ చౌరస్తా హనుమకొండ రోడ్డువైపు డ్రెయిన్‌లు నిండి దుర్వాసన వస్తున్నది.

కేమిడి చంద్రశేఖర్, 15వ వార్డు అడ్వకేట్ : మురికి కాల్వలను రెగ్యులర్‌గా క్లీన్ చేయడంలేదు. ఒకేచోట మురికినీరు ఆగిపోతున్నది.

కమిషనర్ : శుభ్రం చేయిస్తాం.

సిరీష, బీరప్పగుడి ఏరియా : పాత ఇనుప సామాను వ్యాపారం చేసే వారు అన్నీ రోడ్డుపైనే వేస్తుండడంతో పందులు, కుక్కలు ఇక్కడే ఉంటున్నాయి. పిల్లలను ట్యూషన్‌కు తీసుకువెళ్లే సమయంలో మీదకు వస్తున్నాయి.

కమిషనర్ : భయపడకండి, సమస్య పరిష్కరిస్తాం

మహ్మమద్ ఆసిఫ్, గిర్నిగడ్డ: ఆర్నెళ్ల నుంచి మోరీలు క్లీన్ చేయడం లేదు. నల్లా కనెక్షన్ కోసం సీసీరోడ్డు తవ్వి ట్యాప్ బిగించకుండా పోయారు. ఇంటి ఎదురుగా కుక్కలు పెంచుకుంటున్నారు. చిన్నారులను బెదిరిస్తున్నాయి.

కమిషనర్ : సమస్యలకు పరిష్కారం చూపిస్తాం

శ్రీధర్, 14వ వార్డు: హైమాస్ట్ లైట్ వెలుతురు రావడం లేదు. కాలనీలో రాత్రి చీకటిగా ఉంటోంది. ఆర్డీఓ కార్యాలయం వరకు పైపులైన్ కోసం తవ్వడంతో గర్భిణులు ఆస్పత్రికి వెళ్లే సమయంలో ఇబ్బందిగా ఉంది.

అంకం రవీందర్, జనగామ : ప్రభుత్వ ఆస్పత్రి వద్ద హైమాస్ట్ లేక ఇబ్బందిగా ఉంది.

కమిషనర్ : విద్యుత్ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తాం.

కొత్తపల్లి అభినాష్, 5వ వార్డు: కాలనీలో డ్రెయినేజీ లేదు. ఇందిరమ్మ ఇళ్లు సగం వరకు నిర్మించి వదిలేయడంతో అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారింది.

కమిషనర్ : ఇళ్ల విషయం రెవెన్యూ అధికారులకు చెబుతాం. కొత్త డ్రెయినేజీ కౌన్సిల్‌కు సూచిస్తాం.

అంకిత, ఆస్పత్రి నిర్వాహకురాలు : హైదరాబాద్ రోడ్డు హౌసింగ్‌బోర్డు కాలనీ ఏరియా వేద ఆయుర్వేద ఆస్పత్రి దారిలో వీధిదీపాలు, నూతన డ్రెయినేజీ, మిషన్ భగీరథ తాగునీటి సౌకర్యం కల్పించాలి.

కమిషనర్ : స్ట్రీట్ లైట్లు వేసేందుకు పరిశీలిస్తాం. పట్టణానికి దూరంగా ఉంది కాబట్టి కొద్ది సమయం పడుతుంది. అప్పటి వరకు మురికి నీరు ఇంకడానికి గుంతలు ఏర్పాటు చేసుకోవాలి.

ఇల్లెందుల ప్రవీణ్, 9వ వార్డు: గిర్నిగడ్డ ప్రాంతంలోని మాంసం విక్రయదారులు వేస్టేజీని శ్మశాన వాటిక ప్రాంతంలో వేస్తున్నారు. అందులో 40 కుక్కలు తిరుగుతూ ప్రజలను భయపెడుతున్నాయి.

కమిషనర్ : నియంత్రణ చర్యలు తీసుకుంటాం.

సత్యవర్ధన్‌రెడ్డి, 4వ వార్డు : ఫుట్‌పాత్‌లపై చిరు వ్యాపారాలు నిర్వహిస్తుండడంతో వాహనాలను రోడ్డుపైనే పెట్టాల్సి వస్తున్నది. దీంతో జరిమానా వేస్తున్నారు.



కమిషనర్ : ఫుట్‌పాత్ వ్యాపారంపై తనిఖీలు చేస్తాం

నాయిని సంతోష్, 5వ వార్డు, బాణాపురం : 15ఏళ్ల నుంచి శ్మశాన వాటిక లేదు. రంగప్ప చెరువు మత్తడి వద్ద అంతిమ సంస్కారం చేసేది. ఇప్పుడు వద్దంటున్నారు. నెహ్రూ పార్కు వైకుంఠ ధామానికి తీసుకువెళ్తున్నాం. బాణాపురంలో శ్మశాన వాటిక ఏర్పాటు చేయాలి.

కమిషనర్ : సమయం పడుతుంది. తప్పకుండా ఏర్పాటు చేయిస్తాం

సురేందర్‌రెడ్డి, 25వ వార్డు : నెహ్రూపార్కు నుంచి ఆర్టీసీ చౌరస్తా వరకు రోడ్డుపై దిష్టితీసిన నిమ్మకాయలు, గుమ్మడి కాయలు, మిర్చి, పసుపు, కుంకుమ వేస్తున్నారు. ఇబ్బందిగా ఉంది.

కమిషనర్ : ప్రత్యేక డ్రైవ్ చేపడతాం

కాసుల శ్రీనివాస్, శ్రీనగర్‌కాలనీ 22వ వార్డు : డ్రెయినేజీ వ్యవస్థ అధ్వానంగా ఉంది. దోమల నివారణ చర్యలు లేవు. చెత్త సేకరణకు మూడు రోజులకోసారి వస్తున్నారు. కుళాయిలకోసం తీసిన గుంతలు పూడ్చలేదు.

కమిషనర్ : సమస్య పరిష్కరించేలా చూస్తాం.

జహీనా, అంబేడ్కర్‌నగర్ : ప్రభుత్వ పాఠశాల ఆవరణలో మా ఇళ్లు ఉంది. వర్షాకాలంలో వరద నీరు ఇంటిని ముంచెత్తుతోంది. డ్రెయినేజీ చిన్నగా ఉండడంతో నీరు బయటకు వస్తున్నది.

కమిషనర్ : పరిశీలిస్తాం

శ్రీనివాస్, 4వ వార్డు, జ్యోతినగర్, సరిత, 3వ వార్డు : తాగునీరు పచ్చగా వస్తోంది. అదికూడా అరగంటకు ఒక బిందె నిండే పరిస్థితి లేదు. కోటిరత్నం ఆస్పత్రి వెనక పందుల సంచారం పెరిగింది. యజమానిని నిలదీసినా పట్టించుకోవడం లేదు.

కమిషనర్ : తగిన చర్యలు తీసుకుంటాం

ప్రశ్న: కుక్కలు, కోతులతో ఇబ్బంది పడుతున్నాం. పిల్లలను బయటకు పంపితే తోడు వెళ్లాల్సి వస్తోంది. కోతులు ఇళ్లలోకి దూరుతున్నాయి. బెదిరించినా వెంబడిస్తున్నాయి. అర్ధ రాత్రి కుక్కలు అరుస్తుంటే నిద్ర పట్టడం లేదు.

- అశోక్, రైస్ మిల్లర్, గీతానగర్, కడారు ప్రవీణ్, ఎండీ.దస్తగిరి, మేకల సమ్మయ్య, చందు, రాములు, శ్రీనివాస్, రమేష్, సురేష్, కవిత, కూరపాటి శ్రీనివాస్, సంతోష్‌కుమార్, మహేష్, వెంకటరమణారెడ్డి, ఎండీ రఫిక్, సుచరిత, లక్ష్మీ- 1, 4, 7, 8, 11, 12, 14, 17, 26, 27 వార్డులు, వీర్స్‌కాలనీ, శ్రీ విల్లాస్, అంబేడ్కర్‌నగర్, వాసవీ కాలనీ, శ్రీహర్షనగర్

కమిషనర్ : 15 రోజుల్లో సమస్య పరిష్కరిస్తాం.

ప్రశ్న: డ్రెయినేజీ నీరు ఇంటిముందే ఆగుతోంది. పందులు తిరుగుతున్నాయి. దోమలు పెరిగాయి. అవోపా బిల్డింగ్ ఏరియాలో సీసీరోడ్డు తవ్వి పూడ్చలేదు. ప్రమాదాలు జరుగుతున్నాయి. 17వ వార్డులో సీసీరోడ్లపై గుంతలు పడుతున్నాయి. 23వ వార్డులో కోతులు కరెంటు తీగలపై సర్కస్ ఫీట్లు చేస్తున్నాయి. హనుమకొండ రోడ్డు దేవీథియేటర్ ఆవరణ అపార్టు మెంటులో అద్దెకు ఉంటున్న వారు రోడ్డుపైనే చెత్త వేస్తున్నారు.

- పవన్‌కుమార్, క్రాంతి, అబ్బాస్, రేకల చంద్రమోహన్ గౌడ్, జాయ మంజుల, కనక రాజు, సయ్యద్ యాకూబ్, ఎ.నర్సింహులు, కృష్ణమూర్తి, స్వరూప, సయ్యద్ జాహంగీర్- 5, 13, 17, 19, 21, 23 వార్డులు బీరప్ప టెంపుల్, ఇందిరమ్మకాలనీ, ప్రగతినగర్, కుర్మవాడ, శ్రీహర్షనగ్ కాలనీ

కమిషనర్ : అన్ని సమస్యలను పరిశీలిస్తాం

మిద్దెపాక స్టాలిన్, 13వ వార్డు అంబేడ్కర్ సంఘం డివిజన్ ప్రెసిడెంట్ : నెహ్రూపార్కు ఏరియాలో ఫుట్‌పాత్ వ్యాపారం కారణంగా ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. కోతుల బెడద నివారణకు తీసుకువచ్చిన రెండు కొండెంగలు కనిపించడంలేదు.

కమిషనర్ : ఫుట్‌పాత్ వ్యాపారంపై దృష్టి పెట్టాం

బిర్రు రామలింగం, 12వ వార్డు : వీవర్స్‌కాలనీలోని అండర్ బ్రిడ్జి పనులు త్వరగా పూర్తి చేసి, వినియోగంలోకి తేవాలి.

కమిషనర్ : కౌన్సిల్ దృష్టికి తీసుకువెళ్తాం.

కేసీఆర్ ఒక్క హామీ నెరవేర్చలేదు

- ఆయన కుటుంబంలోనే ఐదుగురికి ఉద్యోగాలు
- పేదల రాజ్యంతో బతుకులు మారతాయి
- 'ప్రజాగోస–బీజేపీ భరోసా'లో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్



పార్టీలో చేరిన వారితో బండి సంజయ్

స్టేషన్‌ఘన్‌పూర్: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను గద్దెనెక్కిన తర్వాత సీఎం కేసీఆర్ నెరవేర్చలేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ అన్నారు. 'ప్రజాగోస–బీజేపీ భరోసా' కార్యక్రమంలో భాగంగా శనివారం డివిజన్ కేంద్రం శివాజీచౌక్ వద్ద తాళ్లపెల్లి శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. ఇంటికో ఉద్యోగం అన్నాడు.. ఒక్కరికైనా ఉద్యోగం ఇచ్చాడా.. కేసీఆర్ కుటుంబంలో ఐదుగురికి ఉద్యోగాలు వచ్చాయని అన్నారు. ఘన్‌పూర్‌లో మెగా లెదర్‌పార్కు, టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు చేస్తే ఎందరికో ఉపాధి కలిగేదని పేర్కొన్నారు. ఇంటింటికీ భగీరథ నీరన్నాడు.. అడపా దడపా వచ్చేదీ మురికి నీరే.. గ్రామాల్లో బెల్ట్‌షాపులు ఫుల్లుగా ఉన్నాయి కానీ.. తాగునీరు అందడం లేదని విమర్శించారు. 18 ఏళ్ల వయస్సుపై వారికే 'కంటివెలుగు' నిర్వహించడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. ప్రధాని నరేంద్రమోదీ దేశంలో మూడు కోట్ల మందికి ఇళ్లు అందించారు.. అందులో తెలంగాణకు 2.40 లక్షల ఇండ్లు ఇస్తే.. సీఎం అవినీతితో ఎవ్వరికీ ఇండ్లు అందించడం లేదన్నారు. గ్రామాల్లో ఇళ్లు, రోడ్లు, సాగు నీరు, విద్యుత్, డ్రెయినేజీ తదితర సమస్యల్ని పరిష్కరించేందుకు కేసీఆర్ దగ్గర డబ్బులు ఉండవు కానీ.. లిక్కర్, పత్తాలు, డ్రగ్స్, భూమాఫియా, దొంగ, లంగ, లఫంగి పనులకు మాత్రం ఉంటాయని ఎద్దేవా చేశారు. దళితబంధు బీఆర్ఎస్ నేతలకు కమీషన్ల బంధుగా మారిందని, వారి అనుచరులు, బంధువులకే అందిస్తున్నారని ఆరోపించారు. తెలంగాణలో బతుకులు బాగుపడాలంటే పేదల రాజ్యం రావాలని, బీజేపీని రాష్ట్రంలో అధికారంలోకి తీసుకువస్తే పిల్లలకు ఉచితంగా నాణ్యమైన విద్య, పేదలకు ఉచితంగా కార్పొరేట్ వైద్యం, పక్కా ఇళ్లు అందిస్తామని, ఫసల్‌బీమాతో రైతులను ఆదుకుంటామని బండి సంజయ్ హామీ ఇచ్చారు. అనంతరం జనగామకు చెందిన మాలతిరెడ్డితో పాటు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పలువురు బీజేపీలో చేరారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ గుండె విజయరామారావు, జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంతరెడ్డి, ఇన్‌చార్జ్ పాపారావు, నాయకులు మాదాసు వెంకటేష్, బొజ్జపల్లి సుభాష్, కేవీఎల్ఎన్.రెడ్డి, ఉడుగుల రమేష్, వేముల అశోక్, విద్యాసాగర్‌రెడ్డి, ఐలోని అంజిరెడ్డి, ముక్కెర తిరుపతిరెడ్డి, బొక్క ప్రభాకర్, పవన్‌కుమార్, గట్టు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

- కలెక్టర్ సీహెచ్ శివలింగయ్య

జనగామ రూరల్: డాక్టర్లు ప్రజలకు అందుబాటులో ఉంటూ సత్వరం వైద్యసేవలు అందించాలని కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య అన్నారు. శనివారం అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్‌తో కలిసి వైద్యాధికారులతో కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంసీహెచ్, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, పీహెచ్‌సీలు, సబ్ సెంటర్లలో వైద్యులు అందుబాటులో ఉండాలని, అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. నార్మల్ డెలివరీలను ప్రోత్సహించడంతో పాటు ఆధునిక వైద్య సేవల గురించి ప్రజల్లో అవగాహన కల్పించాలని చెప్పారు. ఇప్పటికే వైద్యరంగంలో మెరుగైన సేవలందిస్తున్న జనగామ జిల్లా.. వివిధ పారామీటర్లలో ముందువరుసన ఉందని, డయాగ్నోస్టిక్ ద్వారా ప్రజలకు మరిన్ని సేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు. ప్రజలు వైద్యం కోసం ప్రైవేటుకు వెళ్లకుండా ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు, వైద్యులు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామ స్థాయిలో డెలివరీల వివరాలు నమోదు చేయాలని, గర్భవతులకు ఐసీడీఎస్ ద్వారా ఇచ్చే న్యూట్రిషన్ కిట్టును అందరికీ అందించాలని చెప్పారు. సమీక్ష సమావేశంలో సూపరింటెండెంట్ సుగుణాకర్‌రాజు, డాక్టర్ సుధీర్‌కుమార్, అశోక్‌కుమార్, రవీందర్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

రుణాలు వెంటనే మంజూరు చేయాలి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

జనగామ రూరల్: ప్రధాన మంత్రి ఉపాధి కల్పన పథకం లబ్ధిదారులకు బ్యాంక్ రుణాలు వెంటనే మంజూరు చేయాలని కలెక్టర్ శివలింగయ్య అన్నారు. శనివారం తన చాంబర్‌లో నిర్వహించిన టీఎస్ ఐ–పాస్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో 12 యూనిట్లకు 21 దరఖాస్తులు రాగా 19 ఆమోదం పొందాయని, ఒకటి తిరస్కరించగా.. మరొకటి పురోగతిలో ఉందని పేర్కొన్నారు. సుమారు రూ.20 కోట్లతో 105 మంది లబ్ధిదారులకు ఉపాధి అవకాశాలు అందుతాయని చెప్పారు. టిప్రైడ్ పథకం ద్వారా ఎస్సీలకు 5, ఎస్టీలకు 18 వాహనాలు మంజూరు చేసినట్లు తెలిపారు. పీఎం ఎంప్లాయిమెంట్ జనరేషన్ స్కీం కింద 75 యూనిట్లకు 29 ఆమోదం పొందాయని, మిగతావి మార్చిలోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఇండస్ట్రీస్ జనరల్ మేనేజర్ రమేష్, లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీధర్, ఎస్పీడీసీఎల్ ఎస్ఈ వేణుమాదవ్, ఆర్టీ శ్రీనివాస్‌రావు, ఎస్సీ కార్పొరేషన్ ఏడీ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయాల పరిరక్షణకు కృషి

- పంచాయతీరాజ్ శాఖ మంత్రి 'ఎర్రబెల్లి'



కోలుకొండ దుర్గామాత ఉత్సవాల్లో మంత్రి

దేవరుప్పుల: సర్వమత సంప్రదాయాల పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తున్నదని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మండల పరిధి కోలుకొండలో శనివారం జరిగిన శ్రీ దుర్గామాత, బొడ్రాయి పునఃప్రతిష్ఠాపన, శ్రీకంఠమహేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన తదితర కార్యక్రమాల్లో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని సామాజిక వర్గాలు జరుపుకునే పండుగలకు ప్రాధాన్యత ఇస్తున్న సీఎం కేసీఆర్.. ఆలయాల పూజారులకు ధూపదీప నైవేద్యం, బతుకమ్మ పండుగకు మహిళలకు చీరెలు, క్రిస్టమస్, రంజాన్ పండుగలకు వస్త్రాలు పంపిణీ చేస్తూ ఆధ్యాత్మిక సమాజ స్థాపనకు పాటుపడుతున్నారని పేర్కొన్నారు. అనంతరం ఆరాధ్య పౌండేషన్ జిల్లా అధ్యక్షుడు ముస్త్యాల కుమారస్వామి ఆధ్వర్యంలో రూ.3 లక్షలతో గనుపాక జ్యోతి కుటుంబానికి నిర్మించిన నూతన భవనాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ కె.రవి, ఉపసర్పంచ్ కృష్ణమూర్తి, ఎంపీటీసీ దామెర రమ, రైతు కోఆర్డినేటర్ కోతి పద్మ, మార్కెట్ డైరెక్టర్ బోనగిరి యాకస్వామి, బీఆర్ఎస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దయాకర్, రవి, పల్ల సుందర్‌రామిరెడ్డి, కొల్లూరి సోమన్న, రాజు, బాబు, అర్జున్, కోతి ప్రవీణ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

- జూనియర్ సివిల్ జడ్జి పృథ్వీరాజ్ డీటీ



సదస్సులో మాట్లాడుతున్న జడ్జి పృథ్వీరాజ్

జనగామ రూరల్: విద్యార్థులకు చట్టాలపై అవగాహన ఉండాలని జూనియర్ సివిల్ జడ్జి పృథ్వీరాజ్ డీటీ అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యాన జిల్లా కేంద్రంలోని మైనార్టీ జూనియర్ గురుకుల కళాశాలలో శనివారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో జడ్జి మాట్లాడారు. మనుషుల అక్రమ రవాణా, డ్రగ్స్ వాడకం, ర్యాగింగ్, మైనర్లు వాహనాలను నడపడం చట్టరీత్యా నేరమని అన్నారు. చట్టాన్ని అతిక్రమించిన వారికి శిక్ష తప్పదని స్పష్టం చేశారు. లోక్ అదాలత్ ద్వారా రాజీ మార్గంలో కేసులు పరిష్కరించుకోవచ్చని ఈ సందర్భంగా సూచించారు. అనంతరం విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో చీఫ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాది మంచాల రవీందర్, రాగళ్ల శ్రీహరి, కళాశాల ప్రిన్సిపాల్ అనిల్ బాబు పాల్గొన్నారు.

ఎస్ఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో..

ఎస్ఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన అవగాహన సదస్సులో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి సీహెచ్ నర్మద పాల్గొన్నారు. ఫేస్ బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్‌లోని ఫొటోలు అప్‌లోడ్ చేయవద్దని చెబుతూ.. వాటి వల్ల కలిగే అనర్థాలను జడ్జి వివరించారు. బాలికలు ఎలాంటి సమస్యలు వచ్చినా ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు ధైర్యంగా చెప్పాలని సూచించారు.

మెస్ వద్ద అపరిశుభ్ర వాతావరణం

రైతులే దేశానికి వెన్నెముక
జాతీయ సదస్సులో డాక్టర్ కోటేష్

సహకార సంఘాలతో పేదలకు ప్రయోజనం
రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్

- 10లో▸

ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షలకు 11మంది గైర్హాజరు

జనగామ రూరల్: జిల్లాలో శనివారం జరిగిన ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షలకు 11 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మొత్తం 179 మంది విద్యార్థులకు 168 మంది హాజరైనట్లు పరీక్షల కన్వీనర్ బైరి శ్రీనివాస్ తెలిపారు. స్టేషన్‌ఘన్‌పూర్, జనగామ పట్టణంలోని పలు కళాశాలలను శ్రీనివాస్‌తో పాటు డెక్ సభ్యులు లలిత, ఆంజనేయరాజు, ఫ్లయింగ్ స్క్వాడ్ సభ్యులు సందర్శించారు.

బ్రహ్మోత్సవాలకు వేళాయె

- నేటి నుంచి వేంకటేశ్వరస్వామి వేడుకలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు



చిల్పూరులో వేంకటేశ్వరస్వామి కొలువుదీరిన గుట్ట



మూలవిరాట్టు

చిల్పూరు: తెలంగాణలో రెండో తిరుపతిగా పేరుగాంచిన చిల్పూరు శ్రీబుగులు వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఫాల్గుణ శుద్ధ సప్తమి ఆదివారం(నేడు) నుంచి ప్రారంభమవుతున్నాయి. మార్చి 5వ తేదీ వరకు జరిగే ఈ ఉత్సవాలకు సంబంధించి అవసరమైన ఏర్పాట్లు చేశామని ఆలయ ఈఓ వెంకట్రావు, చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు, ప్రధాన అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం తొలక్కంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం అవుతాయి. మార్చి 2న ఎదుర్కోళ్లు, 3న స్వామివారి కల్యాణం, 4న రథోత్సవం, 5న చక్రస్నానంతో ఉత్సవాలు ముగుస్తాయి. చిల్పూరు ఆలయం వరంగల్–హైదరాబాద్ జాతీయ రహదారి చిన్నపెండ్యాల బస్‌స్టేజీ వద్ద ఆర్చిగేట్ నుంచి 8 కిలోమీటర్ల దూరంలో ఉంది.


భక్తులకు సౌకర్యాలు



సుదూర ప్రాంతాల నుంచి బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. వారికి అవసరమైన సౌకర్యాలను ఎండోమెంట్, దాతల సాయంతో కల్పిస్తున్నాం.

- వెంకట్రావు, ఆలయ ఈఓ

కనుల పండువగా వేడుకలు



నేటి నుంచి వైభవంగా నిర్వహిస్తున్న స్వామివారి బ్రహ్మోత్సవాలకు భక్తులు అధికసంఖ్యలో తరలిరావాలి. కల్యాణం, రథోత్సవాన్ని కనుల పండువగా నిర్వహిస్తున్నాం. ఆలయ అభివృద్ధికి దాతలు సహకరించాలి.

- పొట్లపల్లి శ్రీధర్‌రావు, ఆలయ చైర్మన్

స్వామివారి ఆశీస్సులు పొందాలి



ఈ ఏడాది బుగులు శ్రీ వేంకటేశ్వర స్వామివారి కల్యాణం మంచి ముహూర్తంలో వచ్చింది. భక్తులు ఈ మహోత్సవంలో పాల్గొని దేవదేవుని ఆశీస్సులు పొందాలి.

- రవీందర్‌శర్మ, అర్చకుడు

జీడబ్ల్యూఎంసీ కొత్త పరిపాలన భవనం



ప్రారంభమైన నూతన పరిపాలన భవన నిర్మాణ పనులు

వరంగల్ అర్బన్: వరంగల్ మహా నగర పాలక సంస్థ(జీడబ్ల్యూఎంసీ) నూతన పరిపాలన భవన నిర్మాణ పనులు శనివారం ప్రారంభమయ్యాయి. అధునాతన ప్రమాణాలతో బల్దియా ప్రధాన కార్యాలయం ఆవరణలోని మెప్మా కార్యాలయానికి పక్కన ఈ భవనం నిర్మాణం కానుంది. ఆరు నెలల కిందట రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే. జీప్లస్5లో భారీ భవనం ప్రణాళికలో తొలుత జీప్లస్2 భవనాన్ని నిర్మించనున్నారు. తదుపరి మరో మూడు అంతస్తులు నిర్మించనున్నారు. ఇందుకు రూ.20.50కోట్లను వ్యయం చేస్తున్నారు. భవనాన్ని రాష్ట్ర టౌన్అండ్‌కంట్రీ ప్లానింగ్ విభాగం నిపుణుల సూచనలు, అనుమతి తీసుకొని నిర్మాణం చేస్తున్నట్లు బల్దియా ఇంజనీర్లు పేర్కొన్నారు.

మోసానికి పాల్పడిన ముగ్గురిపై కేసు

కాజీపేట: దాదాపు రెండు దశాబ్దాల కింద అమ్మిన ప్లాటును మరొకరికి విక్రయించి మోసానికి పాల్పడిన వ్యక్తులపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు కాజీపేట ఇన్‌స్పెక్టర్ గట్ల మహేందర్ రెడ్డి తెలిపారు. ఆయన కథనం ప్రకారం 61వ డివిజన్ ప్రశాంత్ నగర్ కాలనీలో ఓ ప్లాట్‌ను అందె యాదయ్య అనే వ్యక్తి 2003లో కొనుగోలు చేశాడు. అదే ప్లాట్‌ను భూక్యా యమున అనే మహిళ ఇటీవల విక్రయించి డబ్బులు వసూలు చేసింది. మొదట కొనుగోలు చేసిన యాదయ్య ఫిర్యాదు మేరకు యమునతోపాటు కుమారులు అనిల్‌కుమార్, సంపత్ కుమార్‌లపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

పిల్లలను క్రీడల్లో ప్రోత్సహించాలి

- అర్జున అవార్డు గ్రహీత జేజే శోభ
- త్వరలో క్రీడా క్యాలెండర్
- ప్రభుత్వ చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్



పరుగెత్తుతున్న పురుషులు

వరంగల్ స్పోర్ట్స్: పిల్లలను చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రోత్సహించాలని అర్జున అవార్డు గ్రహీత, డబుల్ ఒలింపియన్ జేజే శోభ తల్లిదండ్రులకు సూచించారు. హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న 9వ తెలంగాణ యూత్ అండ్ 400 మెన్ (ఆల్ ఏజ్ గ్రూప్స్) అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. హనుమకొండ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగనున్న పోటీలకు ముఖ్య అతిథిగా జేజే శోభ హాజరై మాట్లాడారు. గతంలో కంటే క్రీడా వసతులు మెరుగుపడ్డాయని, అయితే వసతుల కల్పనలో మరింత ఆధునీకరణ చేయాల్సిన అవసరం ఉందన్నారు. క్రీడాకారులు మొబైల్‌ఫోన్లకు దూరంగా ఉండాలని, కోచ్ పర్యవేక్షణలో పట్టుదల, క్రమశిక్షణతో క్రీడల్లో సాధన చేయాలని అన్నారు. మరో అతిథి ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ తెలంగాణ సీఎం కేసీఆర్ ప్రత్యేక క్రీడాపాలసీ అమలుకు ప్రణాళిక సిద్ధం చేశారని అన్నారు. నగరంలో క్రీడాభివృద్ధికి ప్రత్యేక క్రీడా క్యాలెండర్‌ను రూపొందించి అమలు చేయనున్నట్లు తెలిపారు. అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కె.సారంగపాణి మాట్లాడుతూ 33 జిల్లాల నుంచి 500 మంది క్రీడాకారులు, 100 వరకు టెక్నికల్ అఫిషియల్స్, రెఫరీలు హాజరయ్యారని తెలిపారు. 28 ఈవెంట్లలో జరిగే పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులు మార్చి 10 నుంచి 12 వరకు కర్ణాటకలోని ఉడిపిలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. బ్యాడ్మింటన్ సంఘం జిల్లా కార్యదర్శి పి.రమేష్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ మహ్మద్ అజీజ్‌ఖాన్, డీవైఎస్ఓ గుగులోత్ అశోక్‌కుమార్, అథ్లెటిక్స్ సంఘం బాధ్యులు మూగల కుమార్‌యాదవ్, లెక్కల రాజిరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, ఐలి చంద్రమోహన్ గౌడ్, అంతర్జాతీయ అథ్లెట్ నాగమణి, టెక్నికల్ అఫిషియల్స్ శ్రీమన్నారాయణ, నాగరాజు, అశ్విని తదితరులు పాల్గొన్నారు.

మండుటెండలో క్రీడా వేడుకలు

జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ ఏర్పాట్లలో నిర్వాహకులు పూర్తిగా విఫలమయ్యారు. రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించే వేదిక వద్ద ప్రాథమిక వైద్యచికిత్స అందించేందుకు అందుబాటులో వైద్య సిబ్బందితో పాటు అంబులెన్స్‌ను సైతం స్టేడియం వద్ద ఉంచాలి. మండుటెండలో క్రీడాకారులు భోజనం చేసేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఉదయం 8 గంటలకే అథ్లెటిక్స్‌లో వివిధ ఈవెంట్లలో పోటీలను నిర్వహించిన అసోసియేషన్ బాధ్యులు అధికారికంగా ప్రారంభోత్సవ వేడుకలు 10 గంటలకు నిర్ణయించారు. వేడుకలకు అర్జున అవార్డు గ్రహీత, డబుల్ ఒలింపియన్ జేజే శోభ ముఖ్య అతిథిగా హాజరు కాగా మరో అతిథి ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ కోసం సుమారు మూడున్నర గంటల పాటు ఎదురు చూశారు. అప్పటికే అనేక ఈవెంట్లలో పాల్గొన్న క్రీడాకారులు అలసిపోయారు.



మాట్లాడుతున్న చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్



హైజంప్ చేస్తున్న యువతి



జేజే శోభను సత్కరిస్తున్న చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్

ప్రీతి ఘటనపై ఆగని ఆందోళనలు



కేఎంసీ గేటు ఎదుట ఆందోళన చేస్తున్న గిరిజన సంఘాల నాయకులు

- కేఎంసీ గేటు ఎదుట గిరిజన సంఘాల ఆందోళన

ఎంజీఎం : సీనియర్ విద్యార్థి వేధింపులు భరించలేక మెడికల్ విద్యార్థి ప్రీతి ఆత్మహత్యాయత్నం ఘటనపై ఆందోళనలు ఆగడం లేదు. శుక్రవారం పోలీస్ కమిషనర్ నిందితుడు సైఫ్‌ను అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం ఖమ్మం జైలుకు తరలించినప్పటికీ గిరిజన సంఘాల నాయకులు తమ ఆందోళనలు ఆపడం లేదు. ప్రీతి ఆత్మహత్యాయత్నానికి కారణమైన సైఫ్‌ను వెంటనే ఎన్‌కౌంటర్ చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం కాకతీయ మెడికల్ కళాశాల గేటు వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఘటనపై నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఎంజీఎం సూపరింటెండెంట్, కేఎంసీ ప్రిన్సిపాల్, హెచ్ఓడీలను వెంటనే సస్పెండ్ చేసి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన సంఘాల నాయకులు ఆందోళనతో పెద్దఎత్తున ట్రాఫిక్‌జామ్ కాగా ఇంతేజార్‌గంజ్ సీఐ మల్లేశ్, మట్టెవాడ ఎస్‌హెచ్ఓ శంకర్ వారిని అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు.

బైక్ అదుపు తప్పి యువకుడి మృతి

వర్ధన్నపేట : మండలంలోని ఇల్లంద శివారులో ద్విచక్ర వాహనం అదుపు తప్పి యువకుడు మృతిచెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. స్థానిక ఎస్సై రామారావు కథనం ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలం గంట్లకుంట గ్రామానికి చెందిన చెరుకు శోభన్(20) వరంగల్‌లోని తన స్నేహితుడిని కలిసేందుకు వెళ్తుండగా ఆక్టీవా బైక్ వేగంగా వెళ్తూ బ్రేక్ వేయడంతో కింద పడి తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. మృతుని తండ్రి చెరుకు మల్లయ్యకు ముగ్గురు కుమారులు కాగా చిన్న కుమారుడు శోభన్. ఇతను హైదరాబాద్‌లో ఓ ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. నాలుగు రోజుల క్రితం సొంత గ్రామంలో ఇంటి వద్ద ఉప్పలమ్మ పండుగకు వచ్చాడు. ఫ్రెండ్స్‌ను కలిసేందుకు వరంగల్ వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వచ్చినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ క్రమంలో ఇల్లంద గ్రామశివారులోని లక్ష్మిగార్డెన్ ఎదుట వరంగల్ ఖమ్మం జాతీయ రహదారిపై బైక్ అదుపు తప్పి మృతి చెందాడు.

ఆటోను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

మండలంలోని ఇల్లంద శివారులోని లక్ష్మిగార్డెన్ వద్ద శనివారం ఆర్టీసీ బస్సు ఆటోను ఢీకొట్టిన ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. రాయపర్తి నుంచి తన కుటుంబ సభ్యులతో కలిసి ఆటోలో వరంగల్ వెళ్తుండగా, వరంగల్ నుంచి తొర్రూరు వెళ్తున్న ఆర్టీసీ బస్సు మరో వాహనాన్ని ఓవర్‌టేక్ చేసి ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటో రోడ్డు ప్రక్కకు వెళ్లి నిలిచిపోయింది. ఆటోలో ఉన్న ముగ్గురు ప్రయాణికులకు గాయాలు కావడంతో స్థానికులు వెంటనే వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

జువైనల్ హోంకు ఏడుగురు బాలలు

కాజీపేట: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడుపుతూ పట్టుబడిన ఏడుగురు బాలురపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చగా జువైనల్ మేజిస్ట్రేట్ వారిని రెండు రోజుల పాటు అబ్జర్వేషన్ కోసం జువైనల్ హోంకు పంపించినట్లు కాజీపేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కె.రామకృష్ణ తెలిపారు. కాజీపేటలో వాహనాల తనిఖీలు చేపట్టగా పిల్లలు వాహనాలు నడుపుతూ పోలీసులకు చిక్కారు. వారిపై కోర్టులో ఛార్జ్‌షీట్ వేయడంతో పాటు పిల్లలకు వాహనాలను ఇచ్చిన యజమానులకు జరిమానాలు విధించినట్లు సీఐ వివరించారు.

ముసలమ్మకుంటలో గల్లంతైన విద్యార్థి మృతి

- శాంతినగర్‌లో విషాదం



అలీం మృతదేహాన్ని తీసుకొస్తున్న పోలీసులు

వరంగల్: వరంగల్ ఏనుమాముల సమీపంలోని ముసలమ్మకుంటలో చేపలవేట కోసం వెళ్లి గల్లంతైన విద్యార్థి అలీం(15) మృతదేహం శనివారం ఉదయం చెరువులో తేలిందని ఎస్సై పోగుల శ్రీకాంత్ తెలిపారు. ఎస్సై శాంతినగర్ వాసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నగరంలోని 20వ డివిజన్ శాంతినగర్‌కు చెందిన సాజిదా, అఫ్జల్‌లకు ఇద్దరు కుమారులు అలీం, అజీం ఉన్నారు. ఎల్‌బీనగర్‌లోని మసూం అలీ పాఠశాలలో అలీం 9వ తరగతి చదువుతున్నాడు. అలీం శాంతినగర్‌కు చెందిన ముగ్గురు, చార్‌బౌళికి చెందిన మరో మిత్రునితో మొత్తం ఐదుగురు ముసలమ్మకుంట వద్దకు వెళ్లారు. గుంతల్లో గాలం వేస్తున్న అలీంను ఈత కొట్టేందుకు లోపలికి రమ్మని స్నేహితులు పిలవగా తనకు ఈత రాదని చెప్పినప్పటికీ చివరకు కుంటలోకి దిగాడు. దిగుతున్న క్రమంలో అలీంతో పాటు మరో బాలుడు మునిగి పోయారు. పక్కనే ఉన్న ఒకరు వచ్చి మునిగిపోతున్న వారిని కాపాడే ప్రయత్నం చేయగా ఒకరిని గట్టుపైకి రాగా అప్పటికే అలీం మాత్రం మునిగిపోయినట్లు తెలిసింది. దీంతో అక్కడ నుంచి అలీం స్నేహితులు భయంతో ఇళ్లకు వెళ్లగా ఒకరు మునిగిపోయారన్న విషయం వాట్సప్‌లో వైరల్ అయింది. ఈ మేరకు ఏనుమాముల పోలీసులు ముసలమ్మకుంట వద్దకు వెళ్లి గాలింపులు చేపట్టినప్పటికీ రాత్రి కావడంతో వాయిదా వేశారు. శనివారం ఉదయం 11 గంటల ప్రాంతంలో కుంటలో అలీం మృతదేహం తేలడంతో రెస్క్యూ టీం ఒడ్డుకు తీసుకొచ్చారు. శవపంచనామా నిర్వహించి ఎంజీఎం ఆస్పత్రిలో పోస్ట్‌మార్టం నిర్వహించి మృతదేహాన్ని తల్లిదండ్రులు అప్పగించారు. అలీం తల్లిదండ్రులు నిరుపేద కుటుంబానికి చెందిన వారు కావడంతో శాంతినగర్‌లో విషాదం అలుముకుంది.

స్కూటర్ నంబర్‌తో గుర్తింపు

ముసలమ్మకుంటలో విద్యార్థి గల్లంతైన ప్రచారం జరిగినప్పటికి ఎవరూ అన్న విషయం తేలలేదు. సంఘటనా స్థలం వద్ద విద్యార్థులు తెచ్చిన స్కూటర్‌ను వదిలిపెట్టి వెళ్లడంతో దాని నంబర్‌ను ట్రాఫిక్ పోలీస్ యాప్‌లో చెక్ చేశారు. ఈ స్కూటర్‌పై గత అక్టోబర్‌లో ట్రాఫిక్ చలాన్లు ఉండడంతో దానిపై ప్రయాణిస్తున్న వారిని గుర్తించి నిర్ధారణకు వచ్చి సమాచారం అందించడంతో శాంతినగర్‌కు చెందిన అలీంగా గుర్తించారు. వేసవి సెలవులు వస్తున్న దృష్ట్యా చెరువులు, కాల్వల వద్ద హెచ్చరిక బోర్డులతో పాటు గస్తీ నిర్వహించాలని నగర వాసులు పోలీసు, రెవెన్యూ అధికారులను కోరుతున్నారు.

అదుపుతప్పి టాటాఏస్ బోల్తా







ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులు



ప్రమాద స్థలంలో గుమిగూడిన జనం

- 14 మందికి తీవ్ర గాయాలు
- తప్పిన పెనుప్రమాదం
- 12 మంది హైదరాబాద్ యూసుఫ్‌గూడ వాసులు

ఖానాపురం/నర్సంపేట: అదుపుతప్పి టాటాఏస్ ట్రాలీ వాహనం బోల్తా పడింది. ఈ ఘటనలో 14మందికి గాయాలయ్యాయి. ఈ ప్రమాదం వరంగల్ జిల్లా ఖానాపురం మండల కేంద్రం శివారులో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ యూసుఫ్‌గూడకు చెందిన 12 మంది వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం మైసంపల్లి గ్రామంలోని బంధువుల ఇంటికి గృహప్రవేశ కార్యక్రమానికి శనివారం ఉదయం వచ్చారు. కార్యక్రమం ముగిశాక మైసంపల్లికి చెందిన మరో ఇద్దరితో కలిసి మహబూబాబాద్ జిల్లా గూడూరు మండల పరిధిలోని పర్యాటక ప్రాంతమైన భీమునిపాదానికి వెళ్లారు. సాయంత్రం వరకు పర్యాటక ప్రాంతం వద్ద సంతోషంగా గడిపారు. తిరుగు ప్రయాణంలో టాటాఏస్‌లో మైసంపల్లికి వస్తుండగా ఖానాపురం శివారులో పాకాలవాగు బ్రిడ్జి సమీపంలో వాహనం ముందు టైర్ పంక్చర్ అయి అదుపు తప్పి కల్వర్టుకు ఢీకొని రోడ్డుపై బోల్తాపడింది. ఈ ప్రమాదంలో మైసంపల్లికి చెందిన జెర్రిపోతుల చింటు, జెరిపోతుల వంశీ, యూసుఫ్‌గూడకు చెందిన మట్వాడ పవన్, పోలు, సీహెచ్.వెంకట్, ముదసాని చరణ్, పావని, వెంకటేశ్వర్‌రావు, మౌనిక, చిన్నారి టోని, సాయి, నిరాజ్, అవినాష్, రాజులకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వాహనంలో ఇరుక్కుపోయిన బాధితులను బయటకు తీశారు. స్థానికులు 108కు సమాచారం అందించగా సకాలంలో రాలేదు. దీంతో ఆటోలో స్థానికులతో పాటు పోలీసులు నర్సంపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. వెంటనే వైద్యులు ప్రాథమిక వైద్య చికిత్సలు అందించారు. రోడ్డుపైనే పడడంతో పెను ప్రమాదం తప్పింది.

14మందిని కాపాడిన కల్వర్టు పిల్లర్

ఒక కల్వర్టు పిల్లర్ 14మందిని కాపాడింది. బ్రిడ్జి సమీపంలో ఉన్న కల్వర్టు పిల్లర్‌కు 14 మందితో ప్రయాణిస్తున్న టాటా ఏస్ ముందు ఢీకొనడంతో లోయలో పడకుండా హైవేపై పల్టీ కొట్టింది. దీంతో ఒక్క పిల్లర్ 14 మందిని కాపాడినట్లయింది.

గంట అయినా 108 వాహనం రాలేదు

ప్రమాదం 5.15 గంటలకు జరగగా గాయాలైన వారిని చికిత్స కోసం తరలించేందుకు సమీప ప్రజలు 108కు కాల్ చేసినా గంట వరకు సంఘటన స్థలానికి చేరుకోలేదు. పోలీసులు ఆటోల ద్వారా నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రాణాలు బలికొనే కల్వర్టుకు ఉన్న పిల్లర్ పెద్ద ప్రమాదాన్ని అడ్డుకుంటే గాయాలైన వారిని 108 వాహన సిబ్బంది మాత్రం నిర్లక్ష్యం చేశారు.

వేలేరు సభా స్థలి పరిశీలన

- పలు సూచనలు చేసిన మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



సభాస్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

ధర్మసాగర్(వేలేరు): వేలేరు మండలం సోడషపల్లి గ్రామశివారులో ఈ నెల 27న రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ పలు అభివృద్ధి పనులు ప్రారంభించిన అనంతరం ఏర్పాటు చేయనున్న బహిరంగ సభాస్థలాన్ని శనివారం సాయంత్రం రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు.. ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య, జనగామ జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా శంకుస్థాపన కార్యక్రమం, బహిరంగ సభ, పార్కింగ్ స్థలాలను పరిశీలించారు. అధికారులకు, బీఆర్ఎస్ నాయకులకు పలు సూచనలు చేశారు. కలెక్టర్ సిక్తాపట్నాయక్ కూడా సభాస్థలిని పరిశీలించారు. సోడషపల్లి శివారులో ఏనుమాముల మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న మార్కెట్ సబ్ యార్డు పనులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో డీఆర్‌ఎడీఓ శ్రీనివాస్ కుమార్, సీఈ సుధాకర్‌రెడ్డి, డీఎల్‌పీఓ రవిబాబు, ఈఈ పీఆర్ శంకరయ్య, కాజీపేట ఏసీపీ శ్రీనివాస్, ఎంపీపీ కేసిరెడ్డి సమ్మిరెడ్డి, జెడ్పీటీసీ చాడ సరిత, ఎంపీడీఓ జవహర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ గుండెడ్డి రాజేశ్వర్ రెడ్డి, సర్పంచ్ కొట్టె రాజేష్ పాల్గొన్నారు.

అధికార పార్టీ సర్పంచ్ వేధింపులు..

- ఆశ వర్కర్ ఆత్మహత్యాయత్నం
- వేధింపులకు గురి చేయలేదన్న సర్పంచ్



చికిత్స పొందుతున్న నీల

ఖానాపురం: అధికార పార్టీ సర్పంచ్ వేధింపులు తట్టుకోలేక ఓ ఆశ కార్యకర్త శనివారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. బాధిత మహిళ కున్‌సోతు నీల తెలిపిన వివరాల ప్రకారం.. నాజీతండాకు చెందిన నీల ఆశ కార్యకర్తగా 18 ఏళ్లుగా బోటిమీదితండా, నాజీ తండా పరిధిలో విధులు నిర్వహిస్తోంది. కొద్ది నెలల క్రితం ఆశ కార్యకర్త, హెల్త్ సూపర్‌వైజర్ల పనితీరు సరిగా లేదని, వారిని తొలగించాలని గ్రామపంచాయతీలో తీర్మానం చేశారు. ఇదే సమయంలో మండల సభలో సర్పంచ్ బాదావత్ బాలకిషన్ ఆశ కార్యకర్తపై ఆరోపణలు చేస్తూ అధికారులను నిలదీశారు. ఈ మేరకు ఇటీవల డిప్యూటీ డీఎంహెచ్ఓ విచారణకు రావడంతో ఆ సమయంలో సర్పంచ్ చంపుతానంటూ ఆశ కార్యకర్తను బెదిరిస్తుండగా ఓ యువకుడు వీడియో తీశాడు. ఆ సెల్‌ఫోన్ స్థానిక ఎస్సై వద్దకు చేరింది. ఆయన పది రోజుల పాటు తనవద్దే ఉంచుకోగా ఆశ కార్యకర్త వెళ్లి ఆ సెల్‌ఫోన్ ఇవ్వమని అడగడంతో అదే సమయంలో సర్పంచ్ వచ్చి ఫోన్ తీసుకుని వీడియోను డిలీట్ చేయించి వెళ్లిపోయాడు. ఇలా వీరి మధ్య వివాదం మరింత పెరిగింది. ఈ క్రమంలో కంటివెలుగు శిబిరాల విధులకు నీలను రానీయకుండా అధికారులపై ఒత్తిడి తెచ్చి అడ్డుకోవడం, చంపుతానని బెదిరిస్తున్నాడు. నాలుగు రోజులుగా వేధింపులు ఎక్కువ కావడంతో తట్టుకోలేక శనివారం పురుగుల మందు తాగింది. గమనించిన బంధువులు చికిత్స నిమిత్తం నర్సంపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. సర్పంచ్ బాలకిషన్‌తో పాటు బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌లు తనను ఇబ్బంది పెడుతున్నట్లు నీల ఆరోపించింది. విధులకు వెళ్తుండగా మధ్యలో అడ్డుకుని చంపుతానని బెదిరిస్తూ శారీరక వేధింపులకు గురిచేస్తున్నాడని తెలిపింది. ఆశ కార్యకర్తను చంపాలని, చంపిన తర్వాత చిన్న కేసుతో బయటకు వస్తానని తన ముందే ఫోన్‌లో మాట్లాడుతూ బెదిరించేవాడని వాపోయింది. దీనిపై సర్పంచ్ బాలకిషన్ మాట్లాడుతూ ఆశ కార్యకర్త నీల విధులు సరిగా నిర్వహించడం లేదని, ప్రభుత్వ ఆస్పత్రుల్లో డెలివరీలు చేయించకుండా ప్రైవేట్‌కు పంపుతూ ప్రజల వద్ద డబ్బులు తీసుకుంటుందని తెలిపారు. ఆమెను ఎలాంటి వేధింపులకు గురిచేయలేదని పేర్కొన్నారు. ఆమె డబ్బులు వసూలు చేసిన వివరాలన్నీ తన వద్ద ఉన్నాయని చెప్పారు.

నా చావుకు ఎంపీటీసీ భర్తే కారణం..

- రియల్టర్ విజయ్‌కుమార్ కూడా
- న్యాయం చేస్తానని నమ్మించి మోసం చేశారు
- ఆయన వల్ల ఉద్యోగం కోల్పోయా.. ఆర్థికంగా చితికిపోయా..
- వైరల్ అవుతున్న వీడియో



పురుగుమందు డబ్బాతో సిద్దులు

రఘునాథపల్లి : నాకు న్యాయం చేస్తానని నమ్మించి మోసం చేసిన శివాజీనగర్ ఎంపీటీసీ భర్త బొల్లపల్లి వెంకటస్వామి నా చావుకు కారణమని కోమళ్ల గ్రామానికి చెందిన మంద సిద్ధులు చేతిలో పురుగుల మందు డబ్బా పట్టుకొని సెల్ఫీ తీసుకున్న వీడియో శనివారం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అశ్వరావుపల్లి శివారులోని సర్వే నెంబర్ 324లో తమ కుటుంబానికి 22 గంటల భూమి ఉందని (టోల్ గేట్, మండల కార్యాలయం మధ్య) కబ్జాలో మాత్రం మంద కొంరయ్య, మంద చంద్రయ్య, తూంకుంట్ల రాంరెడ్డిలు ఉన్నారని వీడియోలో సిద్ధులు పేర్కొన్నారు. మా భూమి మాకు ఇప్పిస్తానని తమ గ్రామానికి చెందిన ఎంపీటీసీ భర్త వెంకటస్వామి తనను సంప్రదించాడని, స్వతహాగా లాయర్ అయిన వెంకటస్వామి, ఆయన పేరిట ఎకరం భూమి పట్టా చేయించుకొని నాకు అన్యాయం చేశాడన్నారు. 14 నెలల పాటు కేసు పేరిట లింగంపల్లిలో ఉంటున్న తనను కోమళ్లకు పిలిపించాడన్నారు. దీంతో రవాణా, ఇతర ఖర్చులతో ఆర్థికంగా చితికిపోయినట్టే పేర్కొన్నారు. తరచూ సెలవులు పెట్టి రావడంతో ప్రైవేట్ ఉద్యోగం పోయిందని, ఇబ్బందులు భరించలేక ఆత్మహత్య చేసుకుంటున్నానని, నా చావుకు బొల్లపల్లి వెంకటస్వామి, రియల్టర్ విజయ్‌కుమార్ కారణమని చెప్పాడు. ఈ వీడియో మండలంలోని వివిధ సామాజిక మాధ్యమ గ్రూపుల్లో వైరల్‌గా మారింది. ఈ వీడియోపై వెంకటస్వామిని వివరణ కోరగా తాను పెద్దమనిషిగా వ్యవహరించానే కాని, అతనికి ఎలాంటి అన్యాయం చేయలేదని తెలిపారు. తనను బ్లాక్‌మెయిల్ చేస్తున్న సిద్ధులుపై శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.